ప్రజాశక్తి
బుధవారం 22 ఫిబ్రవరి 2023
5
విజయనగరం

స్పందన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నేడు వర్క్‌షాపు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజావినతుల కార్యక్రమం స్పందన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన అంశాలపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా, మండల స్థాయి అధికారులకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నాం 2 గంటల వరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఓరియంటేషన్ వర్క్ షాపు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. స్పందనలో వచ్చే వినతుల ఆయా అర్జీదారులు సంతృప్తి చెందేలా ఎలా పరిష్కరించాలి వంటి అంశాలపై రాష్ట్ర స్థాయి అధికారులు అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాధాన్యత వాటిని సాధించే విధానంపై కూడా అవగాహన కలిగిస్తారని పేర్కొన్నారు. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వర్క్ షాపులో ప్రణాళిక, పురపాలక, విద్యా, మహిళాశిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ వార్డు సచివాలయ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆడిటోరియంలో జరుగుతుందన్నారు.

వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

జిల్లావాసుల చిరకాల వాంఛ నెరవేరనుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తరగతుల నిర్వహణకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. వైద్యసేవలతోపాటు తరగతులు కూడా అందుబాటులోకి రానుండడంతో అటు విద్యార్థులకు, ఇటు ప్రజలకు మరింత ఊరట లభించనుంది. మెడికల్ కాలేజి తరగతులను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసి) ఈనెల 20న ఉత్తర్వులు జారీచేసింది. 150 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేసినట్లు అందులో పేర్కొంది. రాష్ట్రంలో మంజూరు చేసిన 16 వైద్య కళాశాలలకు గాను ఒక్క విజయనగరం కళాశాలలోనే తరగతులు ప్రారంభం కానుండడం గమనార్హం.

నెరవేరిన చిరకాల వాంఛ

- మెడికల్ కళాశాలకు అనుమతులు
- వచ్చే ఏడాది నుంచి 150 సీట్లతో తరగతుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- రూ.8.6కోట్లతో సర్వజన ఆస్పత్రిలో సదుపాయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల లేని ఏకైక జిల్లా విజయనగరం. దీంతో, విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని దశాబ్దాల తరబడి పోరాటం నడిచింది. చివరకు రాష్ట్ర విభజన అనంతరం టిడిపి ప్రభుత్వం విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. కానీ, అప్పట్లో జిల్లాలో అన్నీ తానై వ్యవహరించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రైవేటు రంగంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. కేంద్ర మంత్రిగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి, జేబు సంస్థగా మార్చేసుకున్న మాన్సాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసేందుకు పావులు కదిపారు. ఈ పేరుతో చైర్మన్‌గా తనకున్న అధికారాన్ని ఉపయోగించి మాన్సాస్‌లో రూ.వందల కోట్ల విలువగలిగి స్థలాలు విక్రయానికి పెట్టారు. చివరకు ప్రభుత్వం దిగిపోయే ముందు తాము కళాశాలను నిర్వహించలేమంటూ చేతులు ఎత్తేశారు.

అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన తరువాత విజయనగరంతో పాటు 16జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం గాజులరేగకు సమీపంలోగల 80ఎకరాల స్థలాన్ని సేకరించి నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకు రూ.500 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాత్కాలిక భవనాలు కొలిక్కివచ్చాయి. మరోవైపు జిల్లా కేంద్రాసుపత్రిని మెడికల్ కాలేజీకి అనుసంధానం చేశారు. ఇక్కడి వైద్య విధాన పరిషత్ వైద్యులను సిహెచ్‌సిలకు తరలించి, ఇక్కడ అవసరమైన భోదనా వైద్యులతోపాటు సిబ్బంది నియామకాలు చేపట్టారు. ఈనెల 3న విద్యాప్రమాణాలు, వైద్య సదుపాయాలు, సిబ్బంది నియామకం తదితర అంశాలను పరిశీలించేందుకు వచ్చిన ఎఎంసి బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలో 2023-24 విద్యాసంవత్సరంలో ఎంబిబిఎస్ తరగతుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో మంజూరైన 16 వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమవుతున్న తొలి కళాశాల ఇదే కావడం గమనార్హం.

శరవేగంగా ప్రభుత్వ వైద్య కళాశాల

గాజులరేగ వద్ద చేపట్టిన వైద్య కళాశాల శాశ్వత భవనాల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. రోజుకు 200 మంది నిపుణులు నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. సుమారు రూ.35 కోట్లతో, పివిబి స్ట్రక్చర్ విధానంలో, వైద్య కళాశాల తరగతుల భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడే ఎంబిబిఎస్ మొదటి సంవత్సర తరగతులను వచ్చే ఏడాది నుంచి నిర్వహించనున్నారు.

సర్వజన ఆసుపత్రిలో సౌకర్యాలు

ప్రభుత్వ వైద్య కళాశాలను తాత్కాలికంగా ప్రారంభించేందుకు, జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో, ఆసుపత్రి రూపురేఖలు మారాయి. ఆధునిక వసతులను కల్పించారు. ఆసుపత్రి పరిశరాలను సుందరంగా తీర్చిదిద్దారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారు. సుమారు 8.6 కోట్ల రూపాయల ఖర్చుతో అవసరమైన భవనాలను నిర్మించి, వసతులను ఏర్పాటు చేశారు. ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ రూమ్, లెక్చర్ గ్యాలరీని నిర్మించారు. మొత్తం 30 పడకలతో ఎన్ఐసియు, ఐసియు, ఎస్ఐసియు సదుపాయాలను ఏర్పాటు చేశారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. గర్భిణులు, చిన్నపిల్లల కోసం ఘోషా ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. వైద్య కళాశాల ఏర్పాటు కోసం మౌలిక వసతులను కల్పించడమే కాకుండా, దీనికి అవసరమైన ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, వైద్య నిపుణులు, ఇతర సిబ్బంది నియామకాలను కూడా దాదాపు పూర్తి చేశారు.

రాష్ట్ర జాతరగా పోలమాంబ పండగ

- ఆలయ అభివృద్ధి దిశగా అడుగులు
- దేవాదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సురేష్ బాబు

ప్రజాశక్తి- మక్కువ

పోలమాంబ చదురుగుడి

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవతగా, గిరిజన జాతరగా వెలుగొందుతున్న పోలమాంబ అమ్మవారి జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించిందని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంవి సురేష్ బాబు వెల్లడించారు మంగళవారం ఐదో జాతర సందర్భంగా ఆయన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి గిరిజన జాతరగా గుర్తించిన జరిగిన నేపథ్యంలో సందర్శించడానికి వచ్చానని ఆయన తెలిపారు. చదురు గుడిఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడుకు ఆయన సూచించారు. అనవసరంగా జరుగుతున్న ఖర్చులను తగ్గించుకొని ఆలయానికి వచ్చే ఆదాయం పెంపుదలకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆ దిశగా అడుగులు వేసేలా ఇఒ రాధాకృష్ణకు పలు సూచనలు చేశారు

శాశ్వత క్యూలైన్ల ఏర్పాటుకు ఆదేశాలు

పోలమాంబ జాతరకు ఇకపై దేవాదాయ శాఖ శాశ్వతంగా క్యూలైన్లు ఏర్పాటు చేసేలా దానికి తగిన అంచనాలను వెంటనే తయారు చేయాలని స్థానిక దేవాదాయశాఖ కార్యాలయం నుంచే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి సేవలో ఉండే వారికి గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పోలమాంబ సన్నిధిలో సేవ చేసుకునే పూజరులకు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సురేష్ బాబు శుభవార్త అందించారు. వంశపారంపర్యంగా వచ్చే పూజారులను (ఆశాదీలు) త్వరలో శాశ్వత నియామకం చేపడతామని ఆయన భరోసా ఇచ్చారు. ఆ దిశగా సంబంధిత అధికారులకు నివేదిక అందజేయాలని ఇఒకు సూచించారు. ఇప్పటివరకు అమ్మవారి సేవలో పాల్గొన్న విశ్రాంతి ఉద్యోగులకు ఇవ్వవలసిన గౌరవ వేతనాలు కూడా వెంటనే మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు

శాశ్వత దుకాణాలకు ఏర్పాట్లు

పోలమాంబ జాతర రాష్ట్ర స్థాయి జాతరగా గుర్తింపు పొందడంతో జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం ప్రత్యేక దుకాణాలను పక్కాగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలమాంబ ఆలయ అభివృద్ధికి జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన భూమి కొనుగోలు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రతి ఇంటికీ పోస్టల్ సేవలందించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రతి ఇంటికి పోస్టల్ సేవలు అందించాలని విశాఖపట్నం రీజినల్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.రాములు అన్నారు. సోమ, మంగళవారం సీతంపేట ఏజెన్సీలో రెండు రోజులు పర్యటించారు. ఈ సందర్భంగా నాయుడు మల్లి ప్రతిభ కళాశాలలను సోమవారం రాత్రి సందర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల కాంపిటేటివ్ పరీక్షలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకుంటే లక్ష్యాలు చేరుకుంటారని అన్నారు. అనంతరం పెదరామ పోస్టల్ కార్యాలయాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. పోస్టల్ సర్వీసులు ఇంటింటికి అందిస్తామని తెలిపారు. ప్రతి మారుమూల పోస్టల్ సర్వీసు సేవలందించాలని సిబ్బందికి సూచించారు. పోస్టల్ బీమా పథకంలో దాచుకున్న డబ్బులు పొదుపు ఇంట్రెస్ట్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఒఎస్‌డి ఎం.యుగంధర్, పోస్‌మాస్టర్, మహేష్ గుప్త, పోస్ట్‌మేన్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్, తిరుమల-మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

అవయవ దానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవయవ దానం ఎందరో జీవితాలలో అది వెలుగులు నింపుతుందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. మంగళవారం తిరుమల- మెడికవర్ హాస్పిటల్, జీవన్ ధాన్, పలు స్వచ్ఛంద సంస్థల ఆ ఆధ్వర్యంలో అవయవ దానంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అవయవ దానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని, సరైన గైడెన్స్ లేకపోవడంతో అత్యంత విలువైన అవయవాలు ఎవరికి ఉపయోగపడకుండా పోతున్నాయని అన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు మూలంగా అవయవ దానం అంటే మనకు సంబంధం లేనిది అనే భావన ప్రజల్లో ఉందన్నారు. మట్టిలో కలిసే అవయవం మరొకరికి ప్రాణం పోస్తుంది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి దీనిపై విస్తత ప్రచారం చేయాలని అన్నారు. బాలాజీ జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ తిరుమల ఆస్పత్రి వరకు సాగింది.

అనంతరం కాన్ఫరెన్సు హాలులో జరిగిన కార్యక్రమంలో జీవన్‌దాన్ రాష్ట్ర సమన్వయకర్త విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబ మాట్లాడుతూ తిరుమల ఆస్పత్రిలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నందున కిడ్నీమార్పిడి శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని సూచించారు. మెడికవర్ కార్డియాలజీ కేర్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ మహారాజ్, మెడికోవర్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.పద్మజ, విజయనగరం తిరుమల మెడికవర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల ప్రసాద్, ఐఎంఎ పూర్వాధ్యక్షులు డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ రామారావు, డాక్టర్ మహేష్, విజయనగరం మెడికవర్ ఇన్‌ఛార్జి డాక్టర్ పద్మకుమార్, రోటరీ క్లబ్, ఐఎంఎ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించండి

ప్రజాశక్తి - కొమరాడ

ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.రమాప్రభను గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మంగళవారం స్థానిక ఎపి బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో, జిల్లా పరిషత్ హై స్కూల్, కొటిపాం పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రామాప్రభకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాటుపడుతున్న రమాప్రభను గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మారుమూల ప్రాంతమైన బీరుపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్సీ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మన్మధరావు, గిరిజన సంఘ మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, గిరిజన సంఘం నాయకులు పువ్వల సోమేశ్వరరావు ఉన్నారు.

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాలకొండ పట్టణంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ,ఎస్ .ఉమా మహేష్ తదితరులు మాట్లాడారు

రఘుబాబుకు రిక్తహస్తం

ఆవిరైన ఎమ్మెల్సీ ఆశలు ● నిరాశలో అభిమానులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ/భోగాపురం

పాదయాత్రలో జగన్‌తో కలిసి నడుస్తున్న కందుల రఘుబాబు (ఫైల్)

నెల్లిమర్ల నియోజకవర్గంలో వైసిపి సీనియర్ నాయకులు కందుల రఘుబాబుకు వైసిపి మరోసారి రిక్తహస్తం అందించింది. ఎప్పటి నుంచో ఎమ్మెల్సీ పదవిపై పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి. నెల్లిమర్ల నుండి మరో సారి పెనుమత్స సురేష్‌బాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో రఘుబాబు అభిమానులు నిరాశకు గురయ్యారు. కొమ్మూరి వారసుడు రఘుబాబు రాజకీయ ప్రస్థానం ముగించినట్టేనని చర్చ జరుగుతోంది. ఎన్నాళ్లీ ఊడిగం అంటూ ఆ సామాజిక వర్గం పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మీ భవిష్యత్తు... మీ ఇష్టం అంటూ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు భోగట్టా. రఘుబాబు ఓర్పు ఇప్పుడు పెద్ద పరీక్షలా మారింది. కుడి ఎడమైతే నియోజవర్గంలో వైసిపికి గడ్డుకాలమే అనిపిస్తుంది.

ఒకప్పటి భోగాపురం నియోజకవర్గాన్ని కొమ్మూరు అప్పడుదొర, సంజీవరావు సోదరులు శాసించారు. వారికి కుల, మతాలకు అతీతంగా ఓటుబ్యాంకు ఉండేదంటే అతిశయోక్తి కాదు. కానీ మారుతున్న రాజకీయ పరిస్థితుల కారణంగా మూడు దశాబ్దాలు పాటు వారికి పదవులు దూరమయ్యాయి. అనంతర పరిణామాలు, వృద్ధాప్యం కారణంగా వారి రాజకీయ వారసుడుగా అల్లుడు కందుల రఘుబాబును పరిచయం చేసారు. రఘుబాబు వెనుక బలమైన సామాజికవర్గం ఉంది. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుండి పోటీ చేసి సుమారు 43వేల ఓట్లు సాధించి తన సత్తా ఏమిటో చూపించారు. తరువాత జరిగిన రాజకీయ పరిణామాలు కారణంగా వైసిపిలో కొనసాగుతున్నారు. 2019లో వైసిపి టికెట్ ఆశించిన వారిలో ఆయన కూడా ఉన్నారు. అయితే కుల సమీకరణల నేపథ్యంలో టికెట్ బడ్డుకొండ అప్పలనాయుడుకు వరించింది. రఘుబాబుకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసాతో ఇప్పటివరకు బుజ్జగించారు.

ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఏకరువు

నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న రఘుబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించాలని ఇటీవల కొందరు నాయకులు ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవి సుబ్బారెడ్డితో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు వద్ద ఏకరువుపెట్టారు. రఘుబాబుకు సిఎం జగన్మోహన్ రెడ్డే హామీ ఇచ్చారని, మంచి గౌరవం కల్పిస్తున్నట్లు చెప్పడంతో ఆ సామాజిక వర్గం ఆనందం వ్యక్తం చేసింది. అయితే తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనతో వారి ఆనందం ఆవిరైపోయింది.

భరోసాకు బై..బై

ఈ సారైనా ఎమ్మెల్యే కోటాలో రఘుబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అందరూ ఆశించారు. అయితే రాజకీయ చదరంగంలో అది తారుమారైంది. రఘుబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడతో ఆ సామాజిక వర్గం నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. మీ వెనుక మేమంతా ఉన్నామంటూ రఘుబాబుపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో రఘబాబు కొంత అయోమయంలో పడినట్లు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న సయయంలో రఘబాబుకు రిక్తహస్తం చూపడం వైసిపికి కొంత ఇబ్బందేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అభిమానుల కోరిక మేరకు రఘుబాబు ఏ నిర్ణయం తీసుకుంటారో అన్నది చర్చనీయాంశంగా మారింది.

ప్రశ్నించే తత్వంతోనే విద్యార్థుల జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రశ్నించే తత్వం అలవర్చుకోవటం ద్వారా విద్యార్థులు ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోగలరని, తద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభిరుచిని గుర్తించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలల విద్యార్థుల ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వారు ప్రదర్శించిన ప్రాజెక్టులు నిజ జీవితంలో ఏ విధంగా ఉపయోగపడతాయో అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనలకు విచ్చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులును ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు ఉపయోగపడే విధంగా ప్రయోగాలు చేయాలని, వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టులను రూపొందించాలని పేర్కొన్నారు. వర్తమాన, భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకొని కొత్త ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు అనుగుణంగా ప్రత్యేక వర్క్ షాప్లు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపికైన 135 ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో వీటి సంఖ్య మరింత పెరగాలని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక స్థాయిలో బోధించే ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారి అభిరుచులను గుర్తించి లక్ష్యాలను నిర్దేశించాలని సూచించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను తీర్చిదిద్దారు. ప్రయాణ సమయాల్లో అంధులకు ఉపయోగపడే విధంగా పరికరాలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులపై పాములు దాడులు చేయకుండా సహకరించే కర్రలాంటి పరికరం ప్రదర్శనలో ఉంచగా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. దాని పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు సేంద్రీయ వ్యవసాయ విధానాలు, భూసార పరిరక్షణ, రోబోటిక్, సోలార్ సిస్టం, నడక మార్గాల్లో ప్రత్యేక మెట్లను ఏర్పాటు చేసి తద్వారా విద్యుత్ ఉత్పత్తి, స్టార్టప్‌లు, కొత్త యాప్‌ల రూపకల్పన తదితర అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులు చూపరులను ఆలోచింపజేశాయి. విశేషంగా ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో డిఇఒ లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ డిఇఒలు వాసుదేవరావు, తిరుపతినాయుడు, డిసిఇబి సెక్రటరీ సన్యాసిరాజు, సెయింట్ ఆన్స్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ లూర్థు మేరీ, సైన్స్ కో-ఆర్డినేటర్ ఎం.కృష్ణారావు, న్యాయ నిర్ణేతలు, వివిధ పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కలెక్టర్
- వర్తమాన అంశాలను, భవిష్యత్తు అవసరాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు

విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ప్రోజెక్టులు

ప్రదర్శనలను పరిశీలిస్తున్న కలెక్టర్

'సీతం' విద్యార్థులకు ఆప్టా ఉపకార వేతనం

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న ఆప్టా ప్రతినిధులు

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన పదకొండు మంది విద్యార్థులకు ఎపిటిఎ (అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) ప్రతినిధులు ఒక్కొక్కరికి రూ.20వేల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం ఈ ఉపకారవేతనం ప్రోత్సాహం స్ఫూర్తిని నిపుతుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ మాట్లాడుతూ ఇటువంటి ప్రోత్సహం ప్రతి ఏటా అందిస్తున్న ఆప్టా వారిని, విద్యార్థుల తల్లితండ్రులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి చెలపాక వెంకటలక్ష్మి, సిహెచ్ ప్రసాద్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రహదారి భద్రతపై అవగాహన సదస్సు

విజయనగరం రూరల్ : చింతలవలస ఎపిఎస్‌పి బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న ఎస్ఐలు, ఎఎస్‌లు, కానిస్టేబుళ్లకు రోడ్డు భద్రత అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఆర్ఐ పిబికె చౌదరి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రోడ్డు రవాణా శాఖ అధికారి పాల్గొన్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్డు భద్రత కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు మాట్లాడుతూ ప్రమాదాలకు గురైన వారిని వెంటనే దగ్గరగా ఉన్న ఆస్పత్రికి తరలించి మానవతా దృక్పథంతో వారి ప్రాణాలు కాపాడాలని హితువు పలికారు. ఎన్‌విఐ రవిశంకర్, డాక్టర్ సాయి శంకర్, ఆర్ఎస్ఐ ఆర్లె కృష్ణారావు మాట్లాడుతూ ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని రోడ్డు ప్రమాదాల నుంచి ఎలా రక్షించాలో వివరించారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన ఎస్‌పి

విజయనగరం : జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ మంగళవారం జామి పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్‌లో అప్లోడ్ చెయ్యాలని, కొద్ది రోజుల్లో జరగనున్న అమ్మవారి పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జామి ఎస్ఐ వీరబాబు వివిధ కేసుల్లో సాధించిన ప్రగతిని జిల్లా ఎస్‌పికి వివరించారు.

పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టిన గ్రామస్తులు

లక్కవరపుకోట : మండలంలోని నిడిగట్టు గ్రామానికి చెందిన సుమారు వంద మంది గ్రామస్తులు మంగళవారం ఎల్ కోట పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా నిర్మించుకుంటున్న పైడితల్లి అమ్మవారి గుడి నిర్మాణాన్ని గ్రామానికి చెందిన వల్ల గోవింద, గుడివాడ ప్రసాదరావు, బర్ల వెంకటరావు, గేదెల అప్పారావు, చప్ప అప్పలనాయుడు, గుడివాడ ఈశ్వరరావు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాతల నుండి ఇప్పటికే సుమారు రూ. 6 లక్షలు విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం ఎస్ఐ ఎం. ముకుందరావు మాట్లాడుతూ తమ గ్రామంలో బుధవారం పర్యటించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బర్ల శంకరరావు, గుడివాడ మల్లు నాయుడు, రొంగలి సూర్యారావు, గుడివాడ వెంకటరావు, సూరెడ్డి లక్ష్మణరావు, గుల్లిపల్లి కృష్ణకుమారి, సూరెడ్డి చిన్న వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సమగ్ర భూ సర్వే

వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామ రెవెన్యూ పరిధిలో గల భూముల్లో సమగ్ర భూ సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమగ్ర భూ సర్వేకి వచ్చిన సిబ్బందికి సహకరించాలని గ్రామ సర్పంచ్ నీరు జోగి వెంకట్రావు రైతులను కోరారు. ఈ సర్వేలో మండల సర్వేయర్ అప్పలనాయుడు, గ్రామ సచివాలయ సర్వేయర్ అరుణ, గ్రామ రెవెన్యూ అధికారి కె సత్యవతి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయానికి కృషి చేస్తాం

వేపాడ : అంబేద్కర్ ఆశయానికి కృషి చేస్తామని మండల దళిత మహాసభ అధ్యక్షులు కొమళ్లపల్లి రాము అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి వారిని ఆర్థికంగా రాజకీయంగా ఎదగనీయకుండా ఓట్లు కోసమే వాడుకొని వదిలేస్తున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి ప్రజలను ఏకం కాకుండా కుల రాజకీయాలు చేస్తూ, కుల సంఘాలు ఏర్పాటు చేస్తూ చిచ్చుపెడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల బడుగు బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదన్నారు.

పెద్దల సభకు మేధావులను పంపించాలి

బొబ్బిలి : పెద్దల సభగా పిలువబడే శాసనమండలికి మేధావులను పంపించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతు సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేధావుల కోసం శాసనమండలిని ఏర్పాటు చేస్తే రాజకీయ పార్టీల నేతలను ఎన్నుకోవడం మేధావులను అవమానించడమేనన్నారు. శాసనమండలికి అన్ని వర్గాల సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం మేధావులను ఎన్నుకునేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను తీసుకోవస్తే రాజకీయ నేతలను ఎన్నుకోవడం సిగ్గు చేటు అన్నారు. ఎమ్మెల్సీలుగా రాజకీయాలకు అతీతంగా మేధావులను ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపిడిఒ చొరవతో పారిశుధ్య పనులు

దగ్గరుండి పనులను చేయిస్తున్న ఇంఛార్జి ఎంపిడిఒత

గజపతినగరం : ఇంఛార్జి ఎంపిడిఒ పప్పు సుదర్శన్ చొరవతో గజపతినగరంలోని సంతోట కాలనీకి చెందిన పారిశుధ్య పనులు మంగళవారం చురుగ్గా చేపట్టారు. రోడ్ల విస్తరణలో భాగంగా కాలువలు నిర్మించడంతో స్థానిక కృష్ణారావు హాస్పటల్ నందు కల్వర్టులో ఎక్కడికక్కడ డ్రైనేజీ నిలిచిపోయింది. దీంతో నగరవాసులు పడుతున్న ఇబ్బందులను, స్థానిక సమస్యలను గుర్తించిన ఎంపిడిఒ వెంటనే మురుగు కాలువలను జెసిబీతో తొలగించారు. ఈ చర్యతో ఉపశమనం పొందిన నగర వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టి.జనార్దన్ రావు పాల్గొన్నారు.

ఆర్ఒ ప్లాంట్ పరిశీలన

గజపతినగరం : మండలంలోని పురిటిపెంట సచివాలయ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఎదురుగా ఉన్న ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ని తూనికలు కొలతలు శాఖ, ఫుడ్ అండ్ సేఫ్టీ శాఖ అధికారులుతో పాటు స్థానిక తహశీల్దార్ ఎం.అరుణకుమారి సంయుక్తంగా మంగళవారం పరిశీలించారు. ప్లాంట్ పరిసర ప్రాంతాలు, అనుమతి పత్రాలు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నీల ప్యాకెట్లు తయారు చేయడం, డబ్బాలతో నీటిని ఇవ్వడం లాంటివి చేయకూడదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా కల్పనా మయూరి

రేగిడి : మండలంలోని తోకలవలస సచివాలయ మహిళ పోలీస్‌గా పనిచేస్తున్న కల్పనా మయూరి రాష్ట్ర సచివాలయ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమె ఎన్నిక పట్ల జిల్లా సచివాలయ మహిళా పోలీసులు అభినందనలు తెలిపారు. ఏపీ గ్రామ, వార్డ్ సచివాలయ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమస్యలు పరిష్కారానికి టీమ్‌గా కృషి చేస్తామన్నారు. ఆయా సచివాలయ పరిధిలో శాంతి భద్రత లోపించకుండా పని చేస్తామని అన్నారు.. కల్పనా మయూరికి ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు, ఏఎస్ఐ రాజారావు అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండండి

జామి: బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. విద్యార్థి దశలో చదువు పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఉంటే ఉన్నత స్థాయికి ఎదగడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని చెప్పారు. మంగళవారం సాయంత్రం కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ సబ్జెక్టులపై అవగాహన పెంచుకోవడంతోపాటు చదువులో పరుగులు పెట్టాలన్నారు. అలాంటపుడే మన లక్ష్యాన్ని చేరుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, రక్తహీనత వల్ల నష్టాలు, లింగ వివక్ష, చేతుల పరిశుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. ముఖ్యంగా జంక్ ఫుడ్ తినకూడదని సూచించారు. దాని వల్ల పిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్.పద్మావతి, పీడీ అప్పలరాజు, ఎన్ సత్తిబాబు, ఎస్. ఈశ్వరరావు, టి.సత్యనారాయణ తదితర ఉపాధ్యాయులతోపాటు ఎంఎస్‌కె ప్రసన్నలక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన

పందెంలో పాల్గొన్న ఎడ్ల బండి

వేపాడ : మండలంలోని నర్సిపల్లి మెట్ట వద్ద శ్రీ అభయాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పరుగు ప్రదర్శనలో విజేతగా నిలిచిన ఎడ్ల బండ్ల యజమానులకు ఎంపిటిసి టీవీ రమణ, గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా నగదును అందజేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

బాలలు మాతృ భాష సారథులు

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

మాతృభాష పరిరక్షణ సారథులు బాలలేనని నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. సి రాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శతక పద్యాల పోటీలను నిర్వహించారు. అనంతరం శతక పద్యాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరి మాతృభాషను వారు పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు వారిగా మన మాతృభాషా అయిన తెలుగును వినియోగంలోకి తేవాలన్నారు. పరభాషను నేర్చుకున్నా మాతృభాషను విడువ కూడదన్నారు. తెలుగులో మాట్లాడటం, రాయటం, వినియోగంలోకి తేవడం, చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పరభాషా వ్యామోహంలో పడకుండా మాతృభాష పట్ల ఇష్టత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్, శ్రీనివాసరావు, మురళీ, రామచంద్రరావు, మహేష్‌లు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెసి రాజు

నెల్లిమర్ల: సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల: ప్రాచీన చారిత్రక నేపథ్యం కలిగిన తెలుగు భాషను ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 70 మిలియన్ల ప్రజలు మాట్లాడుతున్నారని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ఉచ్చారణ క్లిష్టతరమైనప్పటికీ భారతదేశంలో హిందీ తరువాత ఎక్కువ మంది మాట్లాడేది తెలుగు భాష అన్నారు. సభాధ్యక్షత వహించిన తెలుగు భాష పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష అమ్మ వంటిదన్నారు. ఐక్యరాజ్య సమితి పేర్కొన్న అంతరించి పోతున్న భాషలలో తెలుగు భాష ఉండటం బాధాకర మన్నారు. తెలుగును బతికించుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన విశ్వ విద్యాలయం పరిపాలనాధికారి డాక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ, నంది అవార్డు గ్రహీత దాసరి తిరుపతి నాయుడు, లక్ష్మనాయుడు, రచయిత్రి సంతోషి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, డీన్ డాక్టర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: మన మాతృభాష తెలుగును పరిరక్షించుకుందామని శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు అన్నారు. మంగళవారం స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో మాతృభాష దినోత్సవాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు మధ్య శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష సేవలు అందించిన గురజాడ, గిడుగు, కందుకూరి వంటి సంఘ సంస్కర్తల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, ఉపాధ్యాయులు, పెద్ద ఎత్తున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: సంఘ సంస్కర్తల వేషధారణలో ఆకట్టుకుంటున్న చిన్నారులు

వైసిపి అరాచకాన్ని ఖండించాలి : కర్రోతు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

టిడిపి కార్యాలయాలు, నేతలపై అధికార వైసిపి చేస్తున్న దాడులు, అరాచకాన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళ వారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన తరువాత ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్ష నేతల కార్యాలయాలపై దాడుల చేసి రాష్ట్ర ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుందని విమర్శించారు. గన్నవరంలో వైసిపి గూండాలు రెచ్చిపోయి ప్రతిపక్ష టిడిపి నేతలు, కార్యాలయాల పై దాడుల చేయడం జగన్ రాక్షస పాలనకు పరాకాష్ట అని అన్నారు. అధికార వైసిపి పాలనలో ఆపార్టీ నేతలు గూండాల్లా దాడుల చేయడంతో ప్రజలు బయట తిరగడానికి భయ పడుతున్నారని, పోలీసులు కూడా అధికార వైసిపికి వత్తాసు పలకడం దారుణమన్నారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. టిడిపికి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక అధికార వైసిపి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పదుతుందన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా వచ్చే ఎన్నికల్లో అధికార వైసిపి కి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కర్రోతు హెచ్చరించారు. ఈ సమావేశంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు, సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద్, పార్ల మెంటు స్పొక్స్ పర్సన్ లెంక అప్పల నాయుడు, ప్రధాన కార్యదర్శి అవనాపు సత్య నారాయణ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు రెడ్డి వేణు, వీర భద్రరావు, దన్నాన రాంమూర్తి, తెలుగు యువత నాయకులు బైరెడ్డి కళ్యాణ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్నటిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, తదితరులు

విజయనగరం కోట: గన్నవరంలో టిడిపి కార్యాలయం పైన, తెదేపా నాయకుల పైన జరిగిన దాడిని ఖండిస్తుతన్నామని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పరిపాలన చేయడం చేతకానపుడే ఇటువంటి పనికిమాలిన, సైకో పనులకు పాల్పడతారన్నారు. ప్రజాస్వామ్యంలో బతుకుతున్నామని పులివెందుల పంచాయితీ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని చూస్తే ఇక్కడ ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ మొండి వైఖరి మార్చుకొని పరిపాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. భీమశంకర్రావు తెలిపారు. ఓపెన్ కాలేజ్ అడ్మిషన్స్ ఈనెల 27 వరకు జరుగుతాయన్నారు. ఇప్పుడు జాయిన్ అయిన విద్యార్థులకు ఏప్రిల్ నెలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన వారు, గతంలో ఓపెన్ కాలేజీ జాయిన్ అయి మధ్యలో మానేసిన వారు, గతంలో అడ్మిషన్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజ్ కట్టలేని వారు అర్హులని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వేపాడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 22 నుండి 27వ తేదీ వరకు పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె. అప్పారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జరజాపుపేటలో రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటలో స్వర్గీయ ఆరిపాక బ్రహ్మానందం స్మారకార్థం ఆగస్టు నెలలో రాష్ట్ర స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ తెలిపారు. సోమవారం రాత్రి రంగస్థల కళాకారులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆరిపాక బ్రహ్మానందం 5వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ హాజరై బ్రహ్మానందం మాస్టర్ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిమ్స్ హెచ్ ఆర్ జనరల్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో వెంకట రమణ మాట్లాడుతూ రంగస్థల కళాకారులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కీర్తిశేషులు ఆరిపాక బ్రహ్మానందం మాస్టర్ కళారంగానికి సేవలు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన నాటక పోటీల్లో ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన ఉపాధ్యాయ, కళా రంగానికి డ్యుయెల్ రోల్ పాత్ర పోషించి ఆయా రంగాలకు చేసినసేవలు, కృషి ఫలితంగా గ్రామానికి, కుటుంబానికి కీర్తి ప్రతిష్టలు వచ్చాయన్నారు. నాటిక పోటీలకు తన వంతుగా విజేతలకు రూ.50వేలు నగదు బహమతి అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం నట సేవా నాటక సమాజం కళాకారులు మహర్షి నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాగ వంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, గ్రామ పెద్దలు కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్నిబాబు, నల్లి చంద్ర శేఖర్, నల్లి శ్రీను, అవనాపు సత్యనారాయణ, ఎంఎం నాయుడు, పాండ్రంకి సత్యనారాయణ, తుమ్మ నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానందం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మనోధైర్యానికి కరాటే తప్పనిసరి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఆత్మవిశ్వాసానికి, మనోధైర్యానికి కరాటే తప్పనిసర అని స్థానిక ఎస్ఐ ఎం. ముకుందరావు అన్నారు. ఈనెల 7న ఎల్ కోట శాంభవి లేఔట్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామినేషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధర్మకుమార్, స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల వ్యవస్థాపకులు బెహరా శ్రీనివాసరావు తదితరులు సర్టిఫికెట్స్‌ను మంగళ వారం బహుకరించారు. విక్టరీ షుటోఖాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ చిన్ననాటి నుండి కరాటే పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల శరీర ధృడత్వంతో పాటు ప్రమాద సమయంలో మనల్ని మనం రక్షించుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు కరాటేలో చక్కని తరిఫీధినిస్తూ వీరులుగా తీర్చిదిద్దు తున్న రాజు మాస్టర్‌తో పాటు బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామినేషన్‌లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులచే నిర్వహించిన కరాటే విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఎస్ఐ ముకుందరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ఆంగ్ల అధ్యాపకురాలు జె అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ బి జయలక్ష్మి, స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికేట్లు అందిస్తున్న ఎస్ఐ

ఇ- సర్వీసులను సక్రమంగా నిర్వర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- భోగాపురం

ఈ సర్వీసులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూర్యకుమారి సచివాలయ సిబ్బందికి సూచించారు. భోగాపురం సచివాలయం 1ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని బాగా చేపట్టాలన్నారు. రక్తహీనత ఉన్న మహిళలను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో కంప్యూటర్ లేదని సిబ్బంది ఆమెకు వివరించారు. గతంలో దొంగతనం జరగ్గా తమ కార్యాలయంలోని కంప్యూటర్ పోయిందని చెప్పారు. ఆ స్థానంలో కొత్త కంప్యూటర్ వెంటనే మంజూరు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను సందర్శించి పదోతరగతి పిల్లలతో మాట్లాడారు. వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలని, అందరూ బాగా చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వినియోగిస్తున్న ట్యాబ్‌లు పై ఆరా తీశారు. వీటిని కచ్చితంగా ఉపయోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రక్తహీనత కలిగిన పిల్లలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపిడిఒ దాసరి బంగారయ్య, ఇఒ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురం: సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం: సచివాలయాల ద్వారా అందించవలసిన సేవలు పెండింగ్ ఉంటే సహించేదిలేదని కలెక్టర్ సూర్య కుమారి తెలిపారు. మంగళవారం బొబ్బాదిపేట వార్డు సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడుతో కలసి తనిఖీ చేశారు. బిఎల్ఒతో మాట్లాడి వార్డులో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఎంత మంది మరణించిన వారున్నారు, ఎంతమంది ఆధార్ అనుసంధానం జరిగిందనే వివరాలను అడిగారు. 40 శాతం వెరిఫికేషన్ జరిగినట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీస్‌తో మాట్లాడుతూ సఖి సమావేశాల వివరాలను, సమావేశాలకు వచ్చే స్పందనపై ఆరా తీశారు. సంబంధిత రికార్డును తనిఖీ చేశారు. పలు సేవల కోసం అందిన దరఖాస్తుల వివరాలను, ఎన్ని పెండింగ్ ఉన్నాయి, ఎందుకు పెండింగ్ ఉన్నాయని అడిగారు. మ్యుటేషన్స్, సివిల్ సప్లై దరఖాస్తులు పెండింగ్ ఉండడం గుర్తించి పెండింగ్ లేకుండా వెంట వెంటనే పరిష్కరించాలన్నారు. ఒడిపై వెళితే హాజరు పట్టీ లో రాయాలని, ఎక్కడ పని చేసిన సచివాలయ విధులను పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు..

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపిడిఒ పట్నాయక్

పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బొద్దాం పిహెచ్‌సిని ఎంపిడిఒ బిఎస్‌కె పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన వైద్యారోగ్యశాఖ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తిత- వేపాడ

మండలంలోని బికె నాయుడుపేట ప్రాథమిక పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్ఎస్ వల్లి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాల ఆవరణంతా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నూతన విద్యా విధానంపై ప్రత్యేక శ్రద్ధతో సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని లింగాలవలస సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి భోగాపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ కోర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలిపారు. మద్యం అక్రమంగా తరలిసే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజా తయి, డ్రగ్స్ పై మండల వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి కృషి : ఎమ్‌పి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని సంగాంలో గల నాగావళి, సువర్ణముఖి, వేగావతి మూడు నదులు కలిసి త్రివేణి సంగమం వద్ద ఉన్న శ్రీ సంగమేశ్వర ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్, టాయిలెట్స్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు తయారుచేసి ఇస్తే ఎంపి నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం అక్కడ జాతరలో నీలా నగరానికి చెందిన వావిలపల్లి బాబు పురుషోత్తమరావు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, ఈవో పొన్నాడ శ్యామలరావు, అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, పోలిరెడ్డి రమేష్, ఉగిరి ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

దొంగ అరెస్టు : సిఐ

గజపతినగరం : చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేశామని సిఐ లెంక అప్పలనాయుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన ఉద్దంగి పరిధిలో తిరుమల రాజు జగన్నాథరాజు తోటలో గల ఇంట్లోకి చొరబడి పోరాం గ్రామానికి చెందిన జోకాడ భగవాన్ అలియాస్ దుబాయ్ సేటు అనే వ్యక్తి అతన్ని గాయపరచడంతో స్పృహ కోల్పోయాడు. ఆస్పత్రిలో పది రోజులు చికిత్స అనంతరం జగన్నాథరాజు స్పృహలోకి వచ్చి జరిగిన సంఘటనను పోలీసులకు వివరించారు. తనని గాయపరచడంతోపాటు రూ.పదివేలు నగదు, రెండు సెల్ ఫోన్‌లను దొంగలించి పరారయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో రోబరీ కేసుగా నమోదు చేశామని సిఐ చెప్పారు. వెంటనే ముద్దాయిని అదుపులోకి తీసుకుని విచారించి అతని వద్ద నుంచి రూ. 2500 నగదు రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపామని అన్నారు. చెడు అలవాట్లకు బానిసై ఇంతకుముందు పోరం గ్రామంలోనే ఒక చోరీ కూడా చేశాడని ఇంతకుముందు రెండుసార్లు ఇదే తిరుమల రాజు జగన్నాథ రాజు ఇంట్లో చోరీ చేసినట్లు తెలిసిందని అన్నారు. ఈ సమావేశంలో ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్థ కుమార్ ఉన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ అప్పలనాయుడు